క్లుప్తంగా

డంపింగ్ యార్డ్‌ను తలపించేలా..



జిల్లా ఆస్పత్రి ప్రధాన మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు

పాడేరు : స్థానిక జిల్లా ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్యం క్షీణించింది. డంపింగ్ యార్డ్‌ను తలపించేలా ఆస్పత్రి ఎదుట భారీ ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు, సందర్శకులు దుర్గాంధాన్ని భరించలేక ముక్కు మూసుకుని ఉంటున్నారు. కళ్ల ఎదుటే వ్యర్థాలు, చెత్త,చెదారం కనిపిస్తున్నా ఆస్పత్రి సూపరింటెండెంట్, నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వారిపై రోగులు, ప్రజలు మండిపడుతున్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో, పంచాయతీ అధికారులు స్పందించి ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి సహాయకులు కోరారు.

ఐదు ఆలయాలకు మైక్‌సెట్ల పంపిణీ



మైక్‌సెట్లను పంపిణీ చేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: మండలంలో ఐదు దేవాలయాలకు దానధర్మ చారిటబుల్ సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి ప్రసాద్ మైక్‌సెట్లను శనివారం పంపిణీ చేశారు. శరభన్నపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దానధర్మ చారిటబుల్ సేవా సంస్థల ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లో దేవతా మూర్తులను,వృద్ధులకు చీరలు,దుస్తులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

చలో రంపచోడవరం విజయవంతం చేయాలి

రాజవొమ్మంగి : 5వ షెడ్యూల్ ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న నిర్వహించనున్న చలో రంపచోడవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వంతు బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ఆదివాసీ చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాలంటూ 13వ తేదీన రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమంలో అన్ని ఆదివాసీ సంఘాల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

కాఫీ కార్మిక, హెల్పర్ల సంఘం కార్యవర్గం



కాఫీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజు,గిరి

చింతపల్లి: మండల కాఫీ కార్మిక, హెల్పర్ల సంఘం అధ్యక్ష,కార్యదర్శులుగా కొర్రా రాజు, మోరి వెంకటగిరి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం చింతపల్లి గిరిజన్ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కనకవల్లి, సహాయ కార్యదిర్శిగా మురళీ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్. సుందరరావు వ్యవహరిస్తారు. ఈ కమిటీ మూడు సంవత్సరాలు పాటు కొనసాగుతుంది.

టిప్పర్ బోల్తా



ప్రమాదానికి గురైన టిప్పర్

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి డుడుమ వెళ్లే మార్గంలో అరబీరు, సేబుగూడ గ్రామాల మధ్య గల కల్వర్టు వద్ద శనివారం చిప్స్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇస్తూ కల్వర్టు కిందకు టిప్పర్ ఒరిగిపోయి, బోల్తా పడింది. టిప్పర్‌ను స్థానికుల సాయంతో బయటకు తీశారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలో కొన్ని గంటల పాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గొలుగొండ : గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చిట్టింపాడు రోడ్డు, ఏటిగైరంపేట, జోగుంపేట, గుండిపాల ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేసి విడిచిపెట్టారు.



చాపరాయి వద్ద నిర్మాణంలో ఆగిపోయిన కల్వర్టు



డ్రైనేజీ లేక బురదమయంగా ఉన్న పెద్దపాడు గ్రామం



బిల్లులు అందక అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటి నిర్మాణం



ఉపాధ్యాయుడు రాకపోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు

అంతన్నారు... ఇంతన్నారు

ఉపముఖ్యమంత్రి పర్యటించి ఆరు నెలలు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్యలు

చాపరాయి గెడ్డపై వంతెన లేక పీవీటీజీ గిరిజనుల అవస్థలు

సమస్యల వలయంలో పెద్దపాడు

గ్రామం రూపురేఖలు మార్చేస్తానని చెప్పారు... మీకు సమస్యలే లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు...ఎంతో హడావుడి చేశారు... ఇంకేముందు మా బతుకులు మారిపోతాయి... సాక్షాత్తు డిప్యూటీ సీఎం హామీ ఇవ్వడంతో కష్టాలు తీరిపోతాయని ఆ గ్రామస్తులు ఆనందంలో తేలియాడారు. తీరా చూస్తే ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు సమస్యలు యథాతథంగా ఉన్నాయి. హామీ ఇచ్చి ఆరు నెలలైనా సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో మండలంలోని పెద్దపాడు గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆరు నెలల కిందట ఏప్రిల్ 7 న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించి, గిరిజనులతో ముఖముఖీ నిర్వహించారు. గ్రామం రూపురేఖలు మార్చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో తమ కష్టాలు తీరుతాయని, మౌలికసదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆ గ్రామస్తులు ఎంతో ఆశించారు. అయితే నిరాశే మిగిలింది.

- ఇంతవరకూ గ్రామంలో ఒక్క సమస్యకూడా సక్రమంగా పరిష్కారం కాలేదు. సమీపంలో ఉన్న చాపరాయి జలపాతం నుంచి గ్రామం వరకు ప్రధాన మంత్రి జన్‌మన్ గ్రామ సడక్ యోజన్ ద్వారా రూ.1.85 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. అయితే వర్షకాలంలో ఈరోడ్డును కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మించడంతో ఎత్తుపల్లాలతో అధ్వానంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు

- గ్రామంలో డ్రైనేజీలేకపోవడంతో మురుగునీరు, వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో పారిశుధ్యం క్షీణించి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందడంతో వ్యాధులు వ్యాపిస్తాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.
- గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- చాపరాయి పై వంతెన లేకపోవడంతో ఆ గెడ్డ పొంగిన రోజుల్లో పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.
- పీఎం జన్‌మన్ పథకంలో గ్రామానికి 40 ఇళ్లు మంజూరు చేశారు. బిల్లులు మంజూరు చేయకపోవడంతో అవి పునాదులు, పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. ఈ సమస్యను గ్రామస్తులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బిల్లులు వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేకపోయింది.
- చాపరాయి గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- చాపరాయి గెడ్డ వద్ద వంతెన నిర్మిస్తే పెద్దపాడు గ్రామంతో పాటు కోసంగి, వర్రా, చొంపి మీదుగా అరకులోయకు, మాడగడ వ్యూపాయింట్‌కు, సుంకరమెట్ట చర్చి నుంచి విశాఖపట్నం రోడ్డు అనుసంధానమవుతుంది. ఇది వేలాది మంది పర్యాటకులకు దగ్గర మార్గం అవుతుంది. డిప్యూటీ సీఎం గ్రామంలో పర్యటించి ఆరు నెలలవుతున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక పీవీటీజీ గిరిజనులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం, అధికారులు పట్టించుకుని తమ గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.



పెద్దపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించవలసిన ప్రాంతం



నాణ్యతాలోపంతో ఎగుడుదిగుడుగా నిర్మించిన తారురోడ్డు

నాసిరకంగా రోడ్డు నిర్మాణం



చాపరాయి నుంచి గ్రామం వరకూ రూ.1.85 కోట్లతో నిర్మించిన రోడ్డు నాసిరకంగా ఉంది. వర్షాలు కురుస్తున్న సమయంలో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మించారు. వర్షాలు తగ్గిన తరువాత నిర్మించాలని గ్రామస్తులు కోరినా వినిపించుకోలేదు. కనీసం అంగుళం మందం కూడా రోడ్డు వేయలేదు. ఈవిషయమై అధికారులు దృష్టిసారించాలి.

– కొర్రా రూప్పు, పెద్దపాడు గ్రామం

వంతెన నిర్మించాలి



చాపరాయి గెడ్డపై వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. గృహనిర్మాణ సామగ్రిని తరలించడంలో అవస్థలు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలి.

– కొర్రా మలతిరావు, పెద్దపాడు గ్రామం

ఆయుర్వేద వైద్యం ఉత్తమం



శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు సర్టిఫికెట్లు,మందుల తయారీ పరికరాలు అందజేస్తున్న నిర్వాహకులు

అడ్డతీగల: ఆయుర్వేద వైద్యం ఉత్తమమైనదని, దీనిని మరింతగా ప్రాచుర్యంలోనికి తీసుకురావడమే లక్ష్యంగా కమ్యూనిటీ ఆయుర్వేద ప్రాక్టీషనర్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు లయ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ జి.బుల్లయ్య తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలోని వనంతరం(వనమూలికా వైద్యశాల)లో 126 మంది ఆదివాసీ యువతకు నిర్వహించిన ఏడాది సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఆరో బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బుల్లయ్య మాట్లాడుతూ ఔషధ మొక్కలను గుర్తించడం, వాటి ఉపయోగాలు,ఆదివాసీ ప్రాంతాల్లో తరచుగా వచ్చే సాధారణ వ్యాధులకు ఆయుర్వేద మందుల తయారీ, చికిత్స పద్ధతులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. శిక్షణ పొందిన అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన ఆదివాసీ యువతకు శిక్షణ సర్టిఫికెట్లతో పాటు మందుల తయారీ పరికరాలు అందజేశామన్నారు.

సనాతన ధర్మం భారత జాతీయ మతం



మాట్లాడుతున్న దక్షిణామూర్తి శర్మ

కొయ్యూరు: సనాతన ధర్మం భారత జాతీయ మతమని ఆధ్యాత్మిక వేత్త కాశిభట్ల దక్షిణామూర్తి శర్మ అన్నారు. మండలంలోని శరభన్నపాలెంలో శనివారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్ది విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. భారతీయులు పంచభూతాలతో సహా ప్రతి ప్రాణిలోను దైవాన్ని దర్శిస్తారని చెప్పారు. సనాతన ధర్మంలో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు.విదేశీ మతస్తుల నుంచి దేశాన్ని కాపాడేందుకు ఎందరో ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ నాగబాబు ఆధ్వర్యంలో సంఘ సేవకులు శరభన్నపాలెం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

వర్షంతో నష్టపోయిన వ్యాపారులు



వర్షంతో కొనుగోదారులు లేక బోసిపోయిన వారపు సంత

ముంచంగిపుట్టు: వర్షం కారణంగా మండల కేంద్రం ముంచంగిపుట్టులో శనివారం జరిగిన వారపు సంతలో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో సంత ప్రాంగణంలో వరద నీరు భారీగా ప్రవహించింది. దీంతో కూరగాయల రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కొనుగోలుదారులు రాకపోవడంతో కూరగాయలు అమ్ముడుకాలేదు. రాకపోకల చార్జీల సొమ్ము కూడా రాకపోవడం గిరిజన రైతులు తీవ్ర నిరాశతో ఇంటి బాట పట్టారు.వర్షంతో మండల కేంద్రంలో రహదారులన్నీ జలమయమయ్యాయి.

ట్రాఫిక్ అవస్థలు లేకుండా చర్యలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో శనివారం జరిగే వారపు సంతలో వాహనాల రద్దీ కారణంగా ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ఎస్ఐ జె.రామకృష్ణ చర్యలు తీసు కున్నారు. మైక్‌లో సూచనలు చేస్తూ ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. వాహనాల కోసం పార్కింగ్ స్థలం కేటాయించి, అక్కడే నిలిపేలా చర్యలు తీసుకున్నారు. వారపు సంతలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను ఎస్ఐ పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనచోదకులు నిబంధనలు పాటిస్తూ,పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణరావు,పంచాయతీ కార్యదర్శి సింహాచలం,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయండి



పరశురామ్

డుంబ్రిగుడ: నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా అరకులోయలోని రాజధాని జంక్షన్ వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురామ్ తెలిపారు. అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



స్వామి వారి పవిత్రోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ బ్రహ్మలింగేశ్వరస్వామి తెలిపారు. విష్వేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. స్వామి వారి శాంతి కళ్యాణంతో ఉత్సవాలు ముగిస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

జి.మాడుగుల/పెదబయలు : బాణసంచా విక్రయాలు, తయారీ చేసే వారు అనుమతులు తీసుకోవాలని స్థానిక సీఐ శ్రీనివాసరావు, పెదబయలు ఎస్ఐ కొల్లి రమణ వేర్వేరుగా తెలిపారు. బాణసంచా గోదాములు, షాపులు, తయారీ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలన్నారు. దురదృష్టవశాత్తు అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక యంత్రాలు, తగినంత పొడి ఇసుక, నీరు అందుబాటో ఉంచాలని, మైనర్లను బాణసంచా నిల్వ, తయారీ, విక్రయాలు చేసే కేంద్రాల వద్ద పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. విక్రయాలకు అనుమతి పొందిన దుకాణదారులు అధికార్లు సూచించిన సమయం వరకు మాత్రమే అమ్మకాలు నిర్వహించాలని వారు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేసినా, నిల్వచేసినా 112 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు.

జూనియర్ వెటర్నరీ అధికారి అప్పన్నబాబుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న అప్పన్నబాబు

గంగవరం : నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్న పరిశిక అప్పన్నబాబు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ ఎంబీఆర్ యూనివర్సిటీ వారు శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అప్పన్నబాబు మాట్లాడుతూ డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. అప్పన్నబాబుకు మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఎటపాక ఎస్ఐ అప్పలరాజు

ఎటపాక: మండలంలో పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అప్పల రాజు శనివారం హెచ్చరించారు. పేకాట, కోడిపందాలు ఆడే వారిని గుర్తించి స్టేషనుకు పిలిపించి వారిపై బైండోవర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



లంబసింగి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భారతి

చింతపల్లి: విద్యతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతీదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం లంబసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలో బాలికల సంరక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలన్నకు ఎమ్మెల్యే పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



నుర్మతి గ్రామ సందర్శనలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: అనారోగ్యం కారణంగా మండలంలో నుర్మతి పంచాయతీ పినజాగేరి గ్రామంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు,సచివాలయ కన్వీనర్ మనుగూరి బాలన్నను శనివారం పాడేరు ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పరామర్శించారు. బాలన్న ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని మళ్లీ పార్టీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం నుర్మతి, కోరాపల్లి పంచాయతీల్లో పలు గ్రామాల్లో పర్యటించారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సత్యనారాయణ, పెదబాలన్న, శ్రీను, సోమలింగం,సోంబాబు,లింగయ్య, సిర్మా పండన్న, రమణ,బంగారాజు, వార్డు సభ్యుడు లక్ష్మయ్య,కొండబాబు,వలసయ్య, ఈశ్వరరావు, వరహాలనాయుడు, సన్యాసయ్య, తిమోతి, అఖిల్, చిన్నారావు,మండల యువజన అధ్యక్షుడు బాలరాజు తదితరలు పాల్గొన్నారు

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ



నల్లబ్యాడ్జీలతో శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు



శిక్షణ కార్యక్రమాలను పరిశీలిస్తు, స్టేట్ రిసోర్స్ పర్సన్ రమేష్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, ఆంగ్ల బోధనపై రెండు విడతలుగా ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను పాఠశాల స్థాయికి తీసుకువెళ్లి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డీఆర్‌పీలు ఎంతో శ్రమించి శిక్షణ ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 టి.మల్లేశ్వరరావు, డీఆర్‌పీలు రఘుబాబు, దామోదర్, రామచంద్రారెడ్డి, వెంకన్నదొర, సీఆర్‌పీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు స్టేట్ రిసోర్స్‌పర్సన్ రమేష్ శిక్షణ తరగతులను పర్యవేక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

నల్లబ్యాడ్జీలతో..

బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మరీ టీఏఆర్‌ఎల్ శిక్షణా కార్యక్రమాన్ని హాజరయ్యారు.



కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: స్థానిక బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీఏఆర్‌ఎస్ (టీచింగ్ ఎట్ రైట్ లెవెల్) శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు, డీఆర్పీ ఎస్. వి. కోటేశ్వరరావును ఆయన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎంఈవోలు సత్యనారాయణదొర, సూరయ్యరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలానికి చెందిన 352 మంది ఉపాధ్యాయులకు కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో రెండు విడతలుగా ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.